ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

సోమవారం, జూన్ 22, 2026

# తెలంగాణల ఇక వానల దంచుడు.. కరీంనగర్, సిరిసిల్లకు ఆరెంజ్ అలర్ట్..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22:** రాష్ట్రంలో ఒక్కసారిగా చల్ల బడ్డది. రాగల గంట సేపట్లనే చాలా జిల్లాలల్ల ఉరుములు, మెరుపులతోని వాన పడే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది.

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలలో గంటటకు 41 నంచి 61 స్పీడ్‌తోని గాలి దుమారం లేస్తూ, మోస్తరు వానలు పడుతాయని ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింద్రు.ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో గంట లోపలనే ఉరుములతో జరంత వాన పడుతోంది.

ఇక ఇయ్యాల నైట్ లోపల హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, పాలమూరు, గద్వాల, నల్గొండతోని దాదాపు అన్ని జిల్లాల్లో అక్కడక్కడ జల్లులు పడుతాయట.రేపు (మంగళవారం) మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గట్టిగనే భారీ వానలు పడొచ్చు.ఎల్లుండి (బుధవారం) ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల,



నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలల్ల భారీ వానలు దంచే ఛాన్స్ ఉంది. బయటకెళ్లేటోళ్లు జర బైక్‌లు పైలం.. గొడుగులు, రేన్‌కోట్లు మరువద్దు...



తెలంగాణకు రక్షణ రంగం బూస్ట్.. కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ!

2



నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు.. వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా: కేటీఆర్

2




మళ్లీ నీట్ పేపర్ లీక్ అంటూ ప్రచారం.. స్పందించిన ఎన్టీఏ

2





బాల్కనీలో ఓపెన్ టాయిలెట్.. ఓనర్ 'క్రియేటివిటీ' చూస్తే మైండ్ బ్లాక్!

3




గోల్నాక గంగానగర్ బస్తీ దవాఖాన




# బస్తీ దవాఖాన్లకే 'పెద్ద రోగమొచ్చింది'..!

- ఏడు నెలల్నుంచి డాక్టర్లే లేరు..
- ఖాళీ కుర్చీలే 'దర్శనం'.. ప్రైవేటుకు పోతే 'ఖర్చులు'!!
- ల్యాబ్ టెక్నీషియనే అంతా తానై నడిపిస్తున్నరు..
- పాపం.. ఆమెకూ నాలుగు నెలల నుంచి జీతం లేదు!
- అంబర్‌పేట నియోజకవర్గంలో ఆగమైన పేదోళ్ల వైద్యం..!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 22:**

పేదోళ్ల ముంగిటకే పైసల్లేకుండా వైద్యం అందిస్తామని ఆర్భాటంగా పెట్టిన బస్తీ దవాఖానలకు ఇయ్యాల పెద్ద రోగమొచ్చింది!.. 'ఉన్నాదా.. అంటే ఉన్నది.. సదుపాయం ఉందా.. అంటే లేదు' అన్నట్టు తయారైంది వీటి పరిస్థితి. అంబర్‌పేట నియోజకవర్గంలో బస్తీ దవాఖానల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతుంది. నాటి కేసీఆర్ ప్రభుత్వం పట్టణాల్లో ఉండే గరీబోళ్లకు సత్వర వైద్యం అందాలని వీటిని ఏర్పాటు చేస్తే.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై ఘోరమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా సర్కారు ఆశయం కాస్తా అడవిపాలైంది. బస్తీల్లో ఉండే నిరుపేదలకు సుస్తీ చేస్తే.. చూసే నాథుడే కరువయ్యాడు.

### ఖాళీ కుర్చీలే 'దర్శనం'.. ప్రైవేటుకు పోతే 'ఖర్చులు'!

గోల్నాక గంగానగర్‌తో పాటు బతుకమ్మకుంట, అంబర్‌పేట ప్రేమ్ నగర్, కాచిగూడ సుందర్ నగర్, నల్లకుంట రత్నానగర్ దాదాపు అన్ని బస్తీ దవాఖానల్లో ఇదే లొల్లి నడుస్తోంది. గత ఏడు నెలల నుంచి మెడికల్ ఆఫీసర్లు లేకపోవడంతో దవాఖానల్లో కుర్చీలు వెక్కిరిస్తున్నాయి.

కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన డాక్టర్లు డిప్యుటేషన్లు రద్దు కావడంతో వాళ్లంతా పాత పోస్టులకు పోయారు. మరి ఇక్కడ ఖాళీ అయిన కుర్చీల్లో కొత్తవాళ్లను కూర్చోబెట్టే ముచ్చటే మర్చిపోయారు అధికారులు. సీజనల్ వ్యాధులు, బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడే ముసలి ముతక డాక్టర్ లేక అల్లాడిపోతు న్నారు. దిక్కులేక అప్పులు సప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రులకు పరిగెడుతున్నారు.

### ఆమె ఒక్కతే ఏం చేస్తుంది..?

దవాఖానలో ఉన్న ల్యాబ్ టెక్నీషియనే ఇప్పుడు అంతా తానై నడుపుతోంది. పొద్దుగాల వచ్చి రక్తం శాంపిల్స్ అయితే తీసుకుంటోంది కానీ, ఆ రిపోర్టులు చూసి మందులు రాసేందుకు డాక్టరే లేడు. బయటి డాక్టర్లు రాసిస్తేనే ఇక్కడ పరీక్షలు చేసే పరిస్థితి వచ్చింది. ఇకపోతే.. అన్నీ తానై నెట్టుకొస్తున్న ఆ ల్యాబ్ టెక్నీషియన్‌కు కూడా గత నాలుగు నెలలుగా జీతం ఇవ్వడం లేదు. జీతం ఇయ్యకపోయినా పేదోళ్ల కోసం ఆమె డ్యూటీ చేస్తోంది.

### ఇంటర్న్‌షిప్ పిల్లలతోనే నెట్టుకొస్తున్నారు!

డాక్టర్లు లేకపోవడంతో దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఎవరైనా అరకొరగా వస్తే.. అక్కడ ఉన్న ఆయాలే ఏవో తెలిసిన మందులు ఇచ్చి చేతులు దులుపుకుంటు న్నారు. ప్రస్తుతం ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న జూనియర్ డాక్టర్లను తెచ్చి బస్తీ దవాఖానలను ఏదో మమ అనిపిస్తున్నారు తప్ప, పర్మనెంట్ సొల్యూషన్ చూపించడం లేదు. ఇప్పటికైనా నిద్ర లేచి, వెంటనే బస్తీ దవాఖానల్లో డాక్టర్లను నియమించాలని బస్తీ జనం గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

### అందుబాటులోకి రానీ డీఎంహెచ్ వో

ఈ విషయం పై వివరణ కోరడానికి మా 'ఇయ్యాల్టి'ప్రతినిధి ఎంత ప్రయత్నించినా డీఎంహెచ్‌వో అందుబాటులోకి రాలేదు..



# అంబర్‌పేట పటేల్ నగర్‌ల డ్రైనేజీ లీకేజీ..

### ఉరుకులు పరుగులు పెట్టి పైపులు బరాబర్ చేయించిన విజయ్ కుమార్ గౌడ్!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 22:**

అంబర్‌పేట డివిజన్ పటేల్ నగర్ గాంధీ స్కూల్ గల్లీల కొత్తగ సిసి రోడ్డు పనులు నడుస్తున్నయి. ఈ పనుల నడుమనే డ్రైనేజీ పైపులు పగిలిపోయి, నీళ్లన్నీ రోడ్డు మీదికి వచ్చి మురుగు కంపు కొట్టింది. దీనితో బస్తీ జనాలు పరేషాన్ అయి, ఈ మ్యాటర్‌ని అంబర్‌పేట తాజా మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌కు జర గట్టిగనే చెప్పారు. జనాలు చెప్పింద్రో లేదో.. కార్పొరేటర్ అట్లనే ఉరుక్కుంటా బస్తీకి వచ్చిండు. జనాలతో కలిసి గల్లీల తిరిగి సమస్య ఎక్కడుందో చూసిండు. అంతటితో ఆగకుండా, అప్పుడే వాటర్ బోర్డు ఆఫీసర్లను, సిబ్బందిని స్పాట్‌కు పిలిపించారు. "ఇగో.. ఈ డ్రైనేజీ లొల్లిని ఇప్పుడే నయం చేయాలంటే, మల్ల ఇంకోసారి ఈ రోడ్డు మీద మురుగు నీళ్లు కనిపిస్తే ఊరుకునేది లేదు" అని గట్టిగనే వార్నింగ్ ఇచ్చి, వెంటనే పనులు బరాబర్ చేయించిండు. ఇదే టైంల కొత్తగా వేస్తున్న సిసి రోడ్డు పనులు కూడా ఆయన దగ్గరుండి చూసిండు. "రోడ్డు పనులల్ల క్వాలిటీ మస్త్ ఉండాలె, గీ నాణ్యత లోపిస్తే నడిచేది లేదు.. పనులను కూడా జల్దీ జల్దీ ముగించి జనాల కష్టాలు తీర్చాలి" అని ఆఫీసర్లకు, కాంట్రాక్టర్‌కు తెగ చెప్పిండు. లొల్లి సాల్వ్ అయిన బస్తీ జనాలు కూడా శానా ఖుషీ అయ్యింద్రు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దమనుషులు, యువకులు, జనాలు పాల్గొన్నరు.



# దత్త నగర్‌ల మొదలైన సీసీ రోడ్డు పనులు..

### కొబ్బరికాయ కొట్టి స్టార్ట్ చేసిన మహాలక్ష్మి రామన్ గౌడ్!

**ఇయ్యాల్టి న్యూస్, హిమాయత్ నగర్, జూన్ 22:** హిమాయత్ నగర్ డివిజన్ పరిధిలోని దత్త నగర్‌ల గింతకు ముందే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఉత్తగనే పూజ చేసి వదిలేయకుండా.. ఇయ్యాల బరాబర్ ఆ సిసి రోడ్డు నిర్మాణ పనుల గ్రౌండ్‌ల స్టార్ట్ చేసింద్రు. ఈ పనుల ప్రారంభోత్సవం డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్‌తో పాటు సీనియర్ లీడర్ జి.రామన్ గౌడ్ ముఖ్య అతిథులుగా వచ్చారు. వాళ్లతోటి కలిసి మహేష్, జాకీ, సర్ఫరాజ్, అనీష్, అఖిల్ అహ్మద్, ఇంకా బస్తీ వాసి మిర్జా అన్నతో పాటు కాలనీ జనాలు గట్టిగనే హాజరయ్యింద్రు. ఈ టైంల మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. "బస్తీ జనాల తిప్పలు తీర్చడానికే ఈ రోడ్డు వేస్తున్నాం, పనులు జల్దీ జల్దీ కంప్లీట్ చేసి రోడ్డును పైలం చేస్తాం" అని చెప్పారు. కాలనీల రోడ్డు పనులు మొదలు కావడంతో దత్త నగర్ జనాలు మస్త్ ఖుషీ అవుతుంద్రు....




# డ్రగ్స్ జోలికెళ్తే జిందగీ ఆగం..

### జర గట్టిగనే చెప్పిన డిప్యూటీ డీసీపీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్..!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 22:** "గిట్ల గంజాయి, డ్రగ్స్ అలవాటు చేసుకుంటే ఉన్న ఇల్లు, ఊరు అమ్ముకోవాల్సిందే.. జిందగీ ఆగమైపోతది" అని అంబర్‌పేట పోలీసులు బస్తీ జనాలకు గట్టిగనే సమాజాయించి చెప్పిన్రు. ఇయ్యాల అంబర్‌పేట్ ఎంసిహెచ్ గ్రౌండ్‌ల మాదకద్రవ్యాల (డ్రగ్స్) నివారణ మీద ఒక పెద్ద అవగాహన మీటింగ్ పెట్టింద్రు. ఈ మీటింగ్‌కు డిప్యూటీ డీసీపీ జె. నర్సయ్య , అంబర్ పేట ఇన్ స్పెక్టర్ టి. కిరణ్ కుమార్ , సబ్ఇన్‌స్పెక్టర్ తరుణ్ కుమార్ తో పాటు మిగిలిన పోలీస్ సిబ్బంది అంతా వచ్చింద్రు. ఈ టైంల పోలీసులు బస్తీలోని యువకులకు, జనాలకు డ్రగ్స్ వాడితే వచ్చే రోగాలు, పడే తిప్పల గురించి ఇన్‌ప్రాపర్‌గ వివరించి చెప్పారు. డిప్యూటీ డీసీపీ మాట్లాడుతూ.. "ఈ నషాల పడి గీ డ్రగ్స్‌కు బానిసలు కాకుర్రి, దానికి మస్త్ దూరంగా ఉండాలె. మంచిగ తిని తిరుగులే తప్ప గిట్ల పిచ్చి పనులు చేయొద్దు. మీ ఇండ్లల్ల ఉన్న పొరగాళ్లను, యువతను కూడా ఈ డ్రగ్స్ బారిన పడకుండా కంటికి రెప్పలా చూసుకోవాలె" అని తల్లిదండ్రులకు సూచించింద్రు. పోలీసోళ్లు చెప్పిన ముచ్చట నచ్చడంతో బస్తీ జనాలు కూడా ఖుషీ అయ్యింద్రు.

"సార్.. మీరు చెప్పింది బరాబర్, మా గల్లీల డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులకి మేము కూడా తోడుంటాం, మా వంతు సాయం అందిస్తాం" అని చేతులెత్తి మొక్కింద్రు. ఈ కార్యక్రమాల బస్తీ జనాలు, యువకులు గట్టిగనే పాల్గొని సక్సెస్ చేసింద్రు.

# నాగయ్య బిడ్డకు బీమారీ ముదిరితే.. 'మేమున్నం' అని నలభై వేలు చేతుల పెట్టిన కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు..!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 22:** పొద్దుగాల నంచి రాత్రి దాకా ఎండనక, వాననక రోడ్ల మీద ట్రాఫిక్‌ను తిప్పే హోంగార్డుల మానవత్వం ఇయ్యాల అందరి కండ్లల్ల నీళ్లు తెప్పించింది. తమతోని కలిసి డ్యూటీ చేసే ఒక తోటి హోంగార్డు కష్టమొస్తే.. మేమంతా ఒక్కటే అని నిలబడి, ఆరేండ్ల చిన్నారి ప్రాణాలను కాపాడుకున్నారు.అసలు ముచ్చటేందంటే.. కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల కె. నాగయ్య హోంగార్డుగా డ్యూటీ చేస్తున్నాడు. ఆయనకు ఆరేండ్ల చిన్నారి బిడ్డ ఉంది, పేరు అర్పిత. ఆ చిన్న పిల్లకు సడన్‌గా షుగర్ లెవెల్స్ మస్త్ ఎక్కువైపోయి, ఒక్కసారిగా పడిపోయింది. బిడ్డ గింత చిన్న వయసుల అట్ల ఆగం కావడం చూసి తండ్రి నాగయ్య గుండె పగిలిపోయింది. ఏం చేయాలో పాలుపోక, పైసల్లేక ఆందోళన పడుతుంటే.. కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది చూశారు. "నాగన్న.. నువ్వేం పరేషాన్ కాకు, నీ బిడ్డకు మేమంతా ఉన్నం" అని పెద్ద మనసుతో ధైర్యం చెప్పింద్రు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వీర కౌశిక్ సారే ముందడుగు వేసి, అప్పటికప్పుడు స్టేషన్ల ఉన్నో ళ్లందరిని పిలిపించిండు. అందరూ కలిసి నలభై వేల రూపా యల పైసలు పోగుచేసి, సాయంగా నాగయ్య చేతిల పెట్టింద్రు. ఆ పైసలతోని టైమ్‌కు హాస్పిటల్‌ల జైన్ చేసి ట్రీట్‌మెంట్



ఇప్పించడంతో.. ఆ చిన్నారి మంచిగ కోలుకొని నవ్వింది. దీంతోని నాగయ్య కండ్ల నిండా ఆనంద భాష్పాలు వచ్చాయి. ఈ మంచి పనుల కాచిగూడ ఇన్‌స్పెక్టర్ సార్తో పాటు ఎస్సైలు వీర మల్లు, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, కేటీ నాయక్, రాకేష్, ఏఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, ఠాగూర్, శ్రీనివాస్, భాస్కర్, కానిస్టేబుల్ శ్రీనివాస్, హోం గార్డ్ నారాయణ రెడ్డి.. వీళ్లంతా కలిసి చిన్నారికి అండగా నిలిచారు. బస్తీ జనాలు కూడా "పోలీసోళ్లు అంటే గిట్ల ఉండాలె" అని మస్త్ మెచ్చుకుంటాంద్రు.



# నల్లకుంటల ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ..

### ఆడబిడ్డలు పైలంగుండాలన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 22:** అంబర్‌పేట నియోజకవర్గం నల్లకుంట డివిజన్ పరిధిలో టీఆర్టీ క్వార్టర్స్ ఇయ్యాల ఆడబిడ్డల ముఖాలు మురిపంగా కనిపించాయి. ఇందిరా మహిళా శక్తి పథకం కింద బస్తీలోని మహిళలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. ఈ టైంల ఎమ్మెల్యే సారు మహిళలతోని ముచ్చటిస్తూ మహిళలు అన్ని రంగాలల్ల ముందడుగు వేయాలి, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలె అనేదే తమ సంకల్పం" అని చెప్పారు. ఇంకా, సర్కారు ఆడవాళ్ల సాధికారత కోసం తెస్తున్న ఇట్లాంటి మంచి మంచి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వాడుకొని పైకి రావాలని సూచించింద్రు. ఎమ్మెల్యే చేతుల మీదుగా చీరలు అందుకోవడంతోని బస్తీ మహిళలు మస్త్ ఖుషీ అయ్యింద్రు. ఈ కార్యక్రమాలలో నల్లకుంట డివిజన్ పరిధిలోని స్థానిక మహిళలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గట్టిగనే హాజరై సక్సెస్ చేసింద్రు.

# అక్టోబర్ 1 నాటికి ఓటర్ల ఫైనల్ లిస్ట్ రెడీ..

### ఎన్యుమరేషన్ ఫాం ఇయ్యకపోతే ఓటు కట్: గ్రేటర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22:**



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓటర్ల లిస్టు ముద్రణ ముచ్చటను జీహెచ్‌సీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ గట్టిగనే వివరించి చెప్పారు. జులై 31 న ఎన్నికల ఓటర్ల జాబితాను ముద్రిస్తామని, దీని మీద ఎవరికైనా ఏమన్నా లొల్లి గాని, అభ్యంతరాలు, విజ్ఞ ప్తులు ఉంటే.. సెప్టెంబర్ 20వ తారీఖు వరకు చెప్పు కోవచ్చని అన్నారు. ఇక అన్ని పంచాయితీలు వదిలేసి, అక్టోబర్ 1న ఓటర్ల ఫైనల్ జాబితాను బయట పెడతామన్నారు. ప్రస్తుతం సిటీల నడుస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు జనాలు మంచిగ సహకరిం చాలని కమిషనర్ సార్ కోరింద్రు. ఈ సర్ ఫ్రైజ్ కింద ఇప్పటిదాకా 22 లక్షల మంది ఓటర్ల మ్యాపింగ్ బరాబర్ అయిపోయిందని, ఇంకా ఒక 25 లక్షల మంది ఓటర్ల మ్యాపింగ్ మిగిలి ఉందని, దానికి జర టైం పడుతుందని చెప్పారు. అన్ని పొలిటికల్ పార్టీల తరపున బీఎల్‌ఏలు కూడా ఉంటారని అన్నారు. ఇక అసలు ముచ్చటేందంటే.. ఎన్యుమ రేషన్ ఫాం ఇయ్యకపోతే ఓటు హక్కు ఉండదని కమిషనర్ సాబ్ సాఫ్ గా చెప్పింద్రు. అయితే దీనికి ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు, ఆన్‌లైన్‌లో కూడా ఈ ఫామ్ సబ్‌మిట్ చేయొచ్చని, జనాలు ఊకనే ఆందోళన పడొద్దని సూచించింద్రు.

# ఐటీ, ఫార్మా జోష్..

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, ఐటీ-ఫార్మా షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. రోజులో ఎక్కువ భాగం ఒడుదొడుకులు కనిపించినప్పటికీ చివరికి కీలక సూచీలు పాజిటివ్‌గానే స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 291 పాయింట్లు పెరిగి 77,094 వద్ద ముగిసింది. నిఫ్టీ 90 పాయింట్లు లాభపడి 24,102 వద్ద స్థిరపడింది. ఐటీ, ఆరోగ్య రంగ షేర్లు మార్కెట్‌కు దన్నుగా నిలిచాయి.

ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, సిప్లా, డాక్టర్ రెడ్డీస్ వంటి షేర్లు రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.6 శాతం పెరిగాయి. దీంతో పెద్ద కంపెనీలతో పాటు మధ్య, చిన్న తరహా షేర్లపైనా పెట్టుబడిదారుల ఆసక్తి కనిపించింది. ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. కీలక ఆర్థిక పరిణామాలపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ చమురు ధరల తగ్గుదల సాను కూల ప్రభావం చూపిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.







# రైతులకు గుడ్ న్యూస్..

## జిల్లాకో ఇంటిగ్రేటెడ్ భూ భారతి అమలు

**ఇయ్యాల్టి న్యూస్, హైదారాబాద్, జూన్ 22:** రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు చెప్పారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలికినట్లు తెలిపారు. రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామన్నారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రి సమీక్షించారు.

# తెలంగాణకు రక్షణ రంగం బూస్ట్..

## కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ!



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** ? న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. భూ సేకరణ, యుటిలిటీల బదలాయింపు తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రికి హామీ ఇచ్చారు.

దేశ భద్రత, రక్షణకు సంబంధించిన ప్రాజెక్టు కావడంతో రాష్ట్రం తరఫున అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామని స్పష్టం చేశారు. భారత వైమానిక దళం విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల కోసం సివిల్ ఏవియేషన్ టెర్మినల్, కార్గో సదుపాయాలు, మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్ హాల్ కేంద్రాలు, హ్యాంగర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. దీంతో పాటు అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థలు తమ హ్యాంగర్లను ఏర్పాటు చేసుకునేలా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మధ్యప్రాచ్య ప్రాంతంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత ఎయిర్‌లైన్స్‌కు ప్రత్యామ్నాయ కేంద్రంగా ఆదిలాబాద్ ఎదిగే అవకాశాలు ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు.



# భారత్‌కు అమెరికా మరో రక్షణ సహకారం

## అపాచీ, ఎం777 హోవిట్జర్ల నిర్వహణకు ఆమోదం

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** భారత్‌కు రక్షణ రంగంలో మరో కీలక సహకారాన్ని అందించేందుకు అమెరికా ముందుకొచ్చింది. భారత సైన్యం వినియోగిస్తున్న అపాచీ యుద్ధ హెలికాప్టర్లు, ఎం777ఏ2 అల్ట్రా-లైట్ హోవిట్జర్లకు అవసరమైన నిర్వహణ, సాంకేతిక సహాయం, విడిభాగాల సరఫరా, శిక్షణ సేవలను అందించనుంది. అందుకోసం మొత్తం 482.2 మిలియన్ డాలర్ల విలువైన సహాయ ప్యాకేజీని అందించనున్నట్లు అమెరికా అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రతిపాదిత ఒప్పందానికి సంబంధించి అమెరికా ప్రభుత్వం కాంగ్రెస్‌కు అధికారిక సమాచారాన్ని అందించింది. అమెరికా విదేశీ సైనిక విక్రయాల (ఎఫ్ఎంఎస్) కార్యక్రమాన్ని నిర్వహించే డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ (డీఎస్‌సీఏ) జూన్ 17న ఈ సర్వీసులకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెల మే 18నే అమెరికా విదేశాంగ శాఖ భారతదేశానికి ఈ సేవలను అందించేందుకు కాంగ్రెస్‌కు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. దీంతో భారత్ అమ్ములపొదిలోని కీలక ఆయుధాల నిర్వహణ, లాజిస్టిక్స్, శిక్షణ, సాంకేతిక సాయం వంటి వాటికి ఇబ్బంది ఉండదు.

# మెగాస్టార్‌ను కలిసిన బీజేపీ చీఫ్..

## స్టేట్ పాలిటిక్స్‌లో ఆసక్తికర భేటీ

**ఇయ్యాల్టి న్యూస్, హైదారాబాద్, జూన్ 22:** టాలీవుడ్ నటుడు, మెగాస్టార్ చిరంజీవి తో భారతీయ జనతా పార్టీ చీఫ్ రామచందర్ రావు భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని చిరంజీవి నివాసంలో జరిగిన ఈ సమావేశం రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ



నేతృత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మోదీ ప్రభుత్వ సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులకు, ప్రజలకు చేరవేసే 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగానే ఈ భేటీ జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ భేటీలో భాగంగా ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనా ప్రగతికి సంబంధించిన స్పెషల్ బుక్, బ్రోచర్లను చిరంజీవికి రామచందర్ రావు అందజేశారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక పురోగతి, వివిధ రంగాల అభివృద్ధిపై ఇరు ప్రముఖుల మధ్య చర్చ సాగినట్లుగా సమాచారం. కాగా, ఇద్దరి సమావేశం పూర్తిగా మర్యాద పూర్వకమైనదని, ప్రభుత్వ విజయాలను వివరించడానికే మెగాస్టార్‌ను కలిశామని బీజేపీ వర్గాలు స్పష్టం చేశాయి.

# ఘోర రోడ్డు ప్రమాదం..

## డీటీవోపైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్.!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇయ్యాల సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్నను బొగ్గు టిప్పర్ లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయం ఎదుట వెంకన్న తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో వేగంగా వచ్చిన బొగ్గు టిప్పర్ అదుపుతప్పి అధికారుల వైపు దూసుకెళ్లింది. టిప్పర్ బలంగా ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు ఆయన మృతదేహం నుజ్జు నుజ్జయ్యిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.




కాగా, వెంకన్న కేవలం 15 రోజుల క్రితమే బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో ఉండగానే ఆయన మృతి చెందడం జిల్లా అధికార వర్గాలను, రవాణా శాఖ సిబ్బందిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నారు.

# ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో అధ్యాపక శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22:** ఐసీఎఫ్ఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ కింద పనిచేస్తున్న ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ ఆధ్వర్యంలో "ది మోడ్రన్ లా స్కూల్స్: నావిగేటింగ్ అవుట్‌కమ్-బేస్డ్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేటివ్ లీగల్ పెడగాజీ" అనే అంశంపై వారం రోజుల అధ్యాపక శిక్షణ కార్యక్రమం ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 28 వరకు ఈ శిక్షణలో దేశవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు, పరిశోధకులు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్నో డాక్టర్. రామ్ మనోహర్ లోహియా, నేషనల్ లా యూనివర్సిటీ వైస్-చాన్స్‌లర్ ప్రొఫెసర్ (డా.) అమర్ పాల్ సింగ్ మాట్లాడుతూ.. సాంకేతికత, ప్రపంచీకరణ కారణంగా న్యాయ విద్యలో వస్తున్న మార్పులను వివరించారు. ఆధునిక విద్యాసంస్థలు కేవలం సంప్రదాయ సాంకేతికతకే పరిమితం కాకుండా అవుట్‌కమ్-బేస్డ్ ఎడ్యుకేషన్ , డిజిటల్ లెర్నింగ్, ప్రాక్టికల్ విధానాలను అవలంబించాలని సూచించింది. కార్యక్రమ అధ్యక్షుడు, ఐఎఫ్హెచ్ఈ వైస్-చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ టి. కోటి రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్ న్యాయ నిపుణులను తీర్చిదిద్దే అధ్యాపకులు తమ బోధనా నైపుణ్యాలను నిరంతరం పెంచాలని సూచించారు. అలాగే ఐఎఫ్‌హెచ్ఈ ప్రో వైస్-ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ (డా.) ఎలిజబెత్ రోజ్ విద్యార్థి కేంద్ర బోధనా విధానాల ప్రాముఖ్యతను వివరించారు. ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పూజారి రవిశేఖరరాజు స్వాగతం పలుకుతూ.. సమకాలీన న్యాయ విద్య, కొత్త మూల్యాంకన విధానాలు, వినూత్న తరగతి గది బోధనపై ఈ ఎఫ్‌డీపీ దృష్టి సారిస్తుందని తెలిపారు . అసోసియేట్ డీన్




ప్రొఫెసర్ ఎం.డి. అక్బర్ ఖాన్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థుల విశ్లేషణ ఆలోచనలు పెంచేలా బోధన ఉండాలన్నారు. చివరగా ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సాయన్ దాస్ వందన సమర్పణ చేశారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో నిపుణుల ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చల ద్వారా 21వ శతాబ్దపు న్యాయ విద్యకు అవసరమైన వినూత్న బోధనా వ్యూహాలపై అధ్యాపకులకు పూర్తి అవగాహన కల్పించనున్నారు.




# నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు..

## వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా: కేటీఆర్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా విడిచిపెట్టను" అని అన్నారు.




# మళ్లీ నీట్ పేపర్ లీక్ అంటూ ప్రచారం.. స్పందించిన ఎన్టీఏ

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:**

నీట్-యూజీ 2026 రీటెస్ట్ ప్రశ్నాపత్రం లీక్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తీవ్రంగా ఖండించింది. ఆ వీడియో పూర్తిగా కల్పితమని, అందులోని వాదనలు అవాస్తవమని సోమవారం స్పష్టం చేసింది. ఇటువంటి తప్పుడు ప్రచారాలను విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది. మే నెలలో జరిగిన పరీక్షపై పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, దానిని రద్దు చేసి జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్‌ను తిరిగి నిర్వహించారు. సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, పరీక్ష జరిగిన మరుసటి రోజే పేపర్ లీక్ అయిందంటూ ఒక వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై ఎన్టీఏ వెంటనే స్పందిస్తూ, "అత్యంత పటిష్ఠమైన భద్రత, నిఘా మధ్య పరీక్షను విజయవంతంగా పూర్తి చేశాం. వైరల్ అవుతున్న ఆ వీడియో నకిలీది" అని ప్రకటనలో పేర్కొంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్-చెక్ విభాగం కూడా ఈ వీడియోను నిశితంగా పరిశీలించి, అందులో పలు వ్యత్యాసాలు ఉన్నాయని వెల్లడించింది. ముఖ్యంగా, ప్రశ్నపత్రాల ప్యాకెట్‌లో తప్పనిసరిగా ఉండాల్సిన ఓఎంఆర్ ఆన్సర్ షీట్ ఆ వీడియోలో లేకపోవడాన్ని గుర్తించింది. పరీక్షకు ముందు ప్రశ్నపత్రాలు బయటకు వచ్చే ఆస్కారమే లేదని స్పష్టం చేసింది.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వంద సీట్లు పక్కా..

## - మహేశ్ కుమార్ గౌడ్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.



ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.

# 'హర్మూజ్ మూసేస్తే ఇరాన్ దేశమే ఉండదు'

## - ట్రంప్ మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



హర్మూజ్ జలసంధిని మూసివేస్తే ఇరాన్‌కు తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. "మీరు హర్మూజ్ జలసంధిని మూసేస్తే మీ దేశమే ఉండదు. మీరు మీ దేశానికి తిరిగి వెళ్లే పరిస్థితి కూడా ఉండదు" అంటూ ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. అదే సమయంలో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు స్విట్జర్లాండ్‌లో ఉద్రిక్తతలు తగ్గించే దిశగా చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో తొలి విడత చర్చలు జరిగాయి. ఈ సమావేశాలకు అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వం వహించగా, ఇరాన్ తరఫున మొహమ్మద్ బాఘర్ ఘలీబాఫ్ పాల్గొన్నారు. గత వారం కుదిరిన ప్రాథమిక ఒప్పందం ప్రకారం రెండు నెలలపాటు చర్చలు కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ క్రమంలో జరిగిన తొలి సమావేశం అనంతరం చర్చలను కొనసాగించాలని నిర్ణయించారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

## నాంపల్లి కోర్టు సమన్లు - వర్చువల్‌గా విచారణకు హాజరైన అల్లుఅర్జున్



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22:**
పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో తొక్కిసలాట కేసుపై నాంపల్లి కోర్టులో వాదనలు జరిగాయి. ఈ కేసులో వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ న్యాయస్థానం సమన్లు జారీ చేసినప్పటికీ సినీ నటుడు అల్లు అర్జున్ సినిమా షూటింగ్ షెడ్యూల్స్ కారణంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజయ్యారు.

తనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఇందుకు కోర్టు అనుమతించడంతో వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అల్లుఅర్జున్ మినహా మిగతా నిందితులంతా వ్యక్తిగతంగా న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు.





## నడుము సోయగాల.. ఆకట్టుకుంటున్న దివి

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22:** బిగ్‌బాస్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన అందాల భామ దివి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉంటూ తన కెరీర్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తోంది. అయితే నటనతో పాటు సోషల్ మీడియాలోనూ దివి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. తరచూ గ్లామరస్ ఫోటోషూట్‌లకు సంబంధించిన పిక్స్‌ను అభిమానులతో పంచుకుంటూ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. దీంతో ఆమె ఫాలోవర్ల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది. తాజాగా దివి షేర్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఎద అందాలతో బాలీవుడ్ భామ హాట్ షో.. ఓపెన్‌గా చూపిస్తూ !

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22:** ముద్దుగుమ్మ ఆకాంక్ష రంజన్ కపూర్ సినిమాలు, సిరీస్ లు మాత్రమే కాకుండా సోషల్ మీడియాలోనూ తెగ యాక్టివ్ గా ఉంటోంది. తరచుగా హాట్ ఫొటోలు, వీడియోలు పెడుతూ



నెటిజన్లు, ఫాలోవర్స్ ను అట్రాక్ట్ చేస్తోంది..సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫొటోలతో నిత్యం హాట్ ట్రీట్ ఇచ్చే ఈ ముద్దుగుమ్మ పేరు వెనకాల కపూర్ అని ఉండటంతో ఆమె బాలీవుడ్ లో స్ట్రాంగ్ సెటిల్ అయ్యే అవకాశాలు ఉన్నాయని బీటౌన్ వర్గాలు చెప్పుకుంటున్నాయి.



## సంధ్య వేళ.. ప్రకృతి సౌందర్యాల మధ్య అనసూయ..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22:** యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ సాయం సంధ్య వేళలో ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదిస్తున్న ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి

## ప్రకృతి పావని వలపుల జాతర..

### అందాలతో మైమరిపిస్తోందిగా!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22:**
హాట్ హాట్ ఫోజులతో కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తోంది ప్రకృతి పావని. న్యూఢిల్లీలో పుట్టి పెరిగిన ఈ బ్యూటీ రోజు రోజుకు ఈ బ్యూటీ అందాల డోస్ రెట్టింపు చేస్తూ మైమరిపిస్తోంది. అందాల వడ్డింపులో ఏ మాత్రం తగ్గడం లేదు. హద్దులు పక్కన పెట్టేసి రెచ్చిపోతుంది.



## 20 నిమిషాల పనికి రూ.9,500 సంపాదన..!..

### అమెరికా మెకానిక్ సంపాదన చూసి నెటిజన్లు షాక్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** అమెరికాలోని అమృత సింగ్ అనే భారతీయ మహిళ షేర్ చేసిన స్టాగ్రామ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన ఇంటి గ్యారేజ్ డోర్ రిపేర్ చేయడానికి వచ్చిన ఒక మెకానిక్ కేవలం 20 నిమిషాల్లోనే పని పూర్తి చేసి.. ఏకంగా 100 డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 9,500) వసూలు చేశాడని ఆమె వివరించింది.

అయితే ఆమె నెగెటివ్‌గా స్పందించ కుండా, అక్కడ శ్రమకు దక్కే గౌరవాన్ని కొనియాడింది. అమెరికాలో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు లేదా గ్యారేజ్ టెక్నీషియన్లు వంటి నైపుణ్యం కలిగిన కార్మికులు చాలా బాగా సంపాదిస్తారని అమృత తెలిపింది. అక్కడ చేతివృత్తులు కూడా పెద్ద ఇళ్లు, ఖరీదైన కార్లను కలిగి ఉంటారని వారు జీవితంలో గౌరవంగా జీవిస్తూ సకాలంలో పన్నులు చెల్లిస్తారని తెలిపారు. గౌరవంగా బతకడానికి కేవలం పెద్ద పెద్ద డిగ్రీలు మాత్రమే అవసరం లేదు, నైపుణ్యం ఉంటే చాలని ఈ ఘటన నిరూపిస్తోందని ఆమె చెప్పుకొచ్చింది. అమెరికాలో కేవలం విజిటింగ్ ఛార్జీలే ఈ రేంజ్‌లో ఉంటాయని స్పష్టం




చేసింది. ఎవరైనా, వృత్తి ఏదైనా పనిలో నైపుణ్యం ఉంటే విదేశాల్లో ఎంతటి గౌరవం, సంపాదన ఉంటాయో ఈ వైరల్ వీడియో మరోసారి నిరూపించింది!


## నా కష్టాలు నా బిడ్డకు వద్దు..

### అన్నీ వదిలేసి తనే ప్రపంచంగా బతుకుతా: సమంత

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22:**
హీరోయిన్ సమంత ప్రస్తుతం ఎంతో సంతోషంగా ఉంది. సుదీర్ఘ విరామం తరువాత ఆమె నటించిన మూవీ మా ఇంటి బంగారం మంచి విజయం సాధించింది.

మరోవైపు ఆమె తల్లి కాబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆమె గతంలో మాతృత్వం గురించి చెప్పిన మాటలు మరోసారి వైల్ అవుతున్నాయి.

కొన్నేళ్ల క్రితం ఆమె ఓఇంటర్వ్యూలో మాతృత్వం గురించి మాట్లాడుతూ భావోద్వేగా నికి గురైంది. తల్లిగా మారడం తన జీవితంలో అత్యంత ప్రత్యేకమైన ఘట్టం అవుతుందని అంది. నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది అని చెప్పుకొచ్చింది. ఇక పిల్లలను చూసుకుంటూ ఉద్యోగం చేస్తూ ఇంటి బాధ్యతలను చూసుకునే మహిళలు అంటే తనకు ఎంతో గౌరవం అని తెలిపింది. తన చిన్ననాటి అనుభవాలు అంత సంతోషకరంగా లేవని చెప్పిన ఆమె, తాను భవిష్యత్తులో తల్లిగా మారితే తన బిడ్డకు ఎలాంటి లోటు లేకుండా ప్రేమ, ఆప్యాయతలు అందించాలని కోరుకుంటానని తెలిపింది. ఒక బిడ్డ జీవితంలోకి వచ్చిన తర్వాత అతడు లేదా ఆమెనే తన ప్రపంచంగా మారిపోతారని, కెరీర్ కంటే కుటుంబానికే ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేసింది.



## బాల్కనీలో ఓపెన్ టాయిలెట్..

### ఓనర్ 'క్రియేటివిటీ' చూస్తే మైండ్ బ్లాకే!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:**
ఇల్లు లేదా ఫ్లాట్ డిజైన్ చేయడానికి కొన్ని పద్ధతులు, ప్రైవసీ రూల్స్ ఉంటాయి. ముఖ్యంగా బాత్రూమ్‌లను నాలుగు గోడల మధ్య గుప్తంగా నిర్మిస్తారు. కానీ ఐటీ హబ్ బెంగళూరులో ఒక ఫ్లాట్ ఓనర్ మాత్రం ఇంజనీరింగ్ సూత్రాల పక్కన పడేసి అందరి కంటే డిఫరెంట్‌గా ఆలోచించాడు. ఎలాంటి అడ్డుగోడలు లేకుండా నేరుగా బాల్కనీలోనే ఓపెన్ వెస్ట్రన్ కమోడ్‌ను పెట్టేశాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న వీడియోలో ఒక యువతి ఫ్లాట్ లోపల నుండి బాల్కనీ తలుపు తెరిచి బయటకు రాగానే ఆమెకు పెద్ద షాక్ తగులుతుంది.




అక్కడ బహిరంగంగా బాల్కనీ మూలన వెస్ట్రన్ టాయిలెట్ కమోడ్‌ను ఏర్పాటు చేసింది. కనీసం ఆ టాయిలెట్ చుట్టూ ఎలాంటి గోడలు లేదా, కప్పి ఉంచేలా ఎలాంటి ఏర్పాట్లు లేవు. కేవలం బాల్కనీకి చుట్టూ ఉండే ఒక గ్రిల్ కంచె మాత్రమే ఉంది. అంటే అక్కడ కూర్చుంటే రోడ్డుపై వెళ్లే వారందరికీ స్పష్టంగా కనిపిస్తుందన్నమాట!.. ఈ విచిత్రమైన డిజైన్ చూసి నెటిజన్లు ముక్కున వేలేసుకుంటూ ఓ రేంజ్‌లో ట్రోల్ చేస్తున్నారు. "బెంగళూరులో ఫ్లాట్ల రేట్లు, అద్దెలు విపరీతంగా పెరిగిపోవడంతో.. బాల్కనీని కూడా బాత్రూమ్‌గా మార్చేసి అదనపు రెంట్ వసూలు చేయాలని చూస్తున్నారు!" అని కొందరు సెటైర్లు వేస్తుంటే..

"చల్లని గాలి పీలుస్తూ, ప్రకృతిని ఆస్వాదిస్తూ.. ప్రకృతి పిలుపు అందుకోవడానికి ఇదో అద్భుతమైన వింత డిజైన్"అంటూ మరికొందరు జోకులు పేలుస్తున్నారు. క్యాప్ ప్రైవసీని గాల్లో కలిపేసిన ఈ 'బాల్కనీ టాయిలెట్' వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది!

## కన్నీరు పెట్టిస్తున్న ఘటన..

### ఒకే ఇంట్లో 4 డెడ్ బాడీలు! ఏం జరిగిందంటే..?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22:** ఏపీ చిత్తూరులో దారుణం జరిగింది. ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డి పల్లిలో ఈ




దారుణం చోటుచేసుకుంది. దినసరి కూలీలుగా పనిచేస్తున్న దాము, నిర్మల దంపతులుతోపాటు ఇద్దరు పిల్లల ప్రాణాలను బలితీసుకుంది. వివరాల్లోకెళ్తే..దాము దినసరి కూలీ. మేస్త్రీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చేవాడు. భార్య నిర్మల ఇద్దరు పిల్లలు దిలీప్, శ్రీవిద్య పిల్లలతో కుటుంబం సంతోషంగానే ఉండేది. అయితే తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురైన భార్య నిర్మల ఏడాదిగా మంచానికి పరిమితమైంది. ఎన్నో ఆసుపత్రులకు చూపించిన దాము నిర్మల ఆరోగ్యం నయం కాదని వైద్యులు తేల్చి చెప్పడంతో దాము మనోవేదనకు గురైయ్యాడు. రెండు రోజుల క్రితం కూడా నిర్మలను ఆసుపత్రికి తీసుకెళ్లిన దాము ఇక బతకడం కష్టమని తేలిపోవడంతో కఠినమైన నిర్ణయానికి కుటుంబం వచ్చింది. ఇద్దరు పిల్లలు దిలీప్, శ్రీవిద్య, భార్య నిర్మలకు పురుగులు మందు తాగించిన దాము ఉరి బిగించి కుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబం మొత్తం ఆత్మహత్య కు పాల్పడగా ఇక అంత్యక్రియలకు ఎవరికి భారం కాకుండా కావలసిన డబ్బు ఏటీఎంలో ఉంచాడు. ఈ మేరకు ఏటీఎం పిన్ నెంబర్ తో లెటర్ రాసి పెట్టి ఆ పేపర్ ను టీవీకి అతికించిన దాము భార్య ఇద్దరు పిల్లలు మృతి చెందాక తాను కూడా ఉరివేసుకొని చనిపోయాడు. గ్రామంలోనే కాకుండా పనిచేసే చోట అందరితో కలివిడి గా ఉండే దాము తీసుకున్న కఠిన నిర్ణయం ఒకే కుటుంబంలో నలుగురు మృతికి కారణం అయ్యింది.